పని చేయని పవర్ బోర్లు.. పట్టించుకోని అధికారులు

- మరమ్మతులకు నోచుకోకపోవడంతో తలెత్తుతున్న సమస్యలు
- ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలంటున్న ప్రజలు


పవర్ బోరు పనిచేయకపోవడంతో నిరుపయోగంగా మారిన వాటర్ ట్యాంక్

చార్మినార్: ప్రస్తుతం ఎన్నడు లేని విధంగా బెంగళూర్‌లో నీటి ఎద్దడి ఏర్పడిన విషయం తెలుసుకుంటున్న పాతబస్తీ ప్రజలు అమ్మో..! తాగునీటి సమస్య అంటూ అని ముందు జాగ్రత్త చర్యల కోసం దారులు వెతుకుతున్నారు. అసలే ఎండా కాలం.. నీటి వాడకం ఎక్కువగా ఉంటుంది. కుళాయిల్లో సరఫరా అయ్యే అరకొరనీరు ఏమాత్రం సరిపోవు. రోజు వారి అవసరాల కోసం బోరు నీరు ఎంతో అవసరం. అందుకే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం సంబంధిత జలమండలి అధికారులను ఇప్పటి నుంచే కోరుతున్నారు. పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన పవర్ బోర్లు పని చేయడం లేదు. అవి తుప్పు పట్టిపోతున్నాయి. వేసవి కాలం నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వెంటనే పవర్ బోర్లు, చేతి పంపులు, వాటర్ ట్యాంకులను బాగు చేయించాలని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా పవర్ బోర్లు..

పాతబస్తీలోని సంబంధిత జలమండలి అధికారులు పవర్ బోర్‌లను పట్టించుకోక పోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. తాగునీటి అవసరాలు తీర్చడానికి గతంలో ఏర్పాటు చేసిన పవర్ బోర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. అరకొర నీటి సరఫరా ఉన్న చోట తాగునీటి సమస్యను తగ్గించడానికి ఏర్పాటు చేసిన పవర్ బోర్లు పని చేయక పోవడంతో వాటికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన సింటెక్స్ వాటర్ ట్యాంక్ డబ్బాలు సైతం మూలనపడ్డాయి. కొన్ని చోట్ల పూర్తిగా కనుమరగయ్యాయి. కొన్ని చోట్ల స్థానికులు ఆయా స్థలాలను కబ్జా చేసేశారు. పాతబస్తీలోని యాకుత్‌పురా, చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా తదితర నియోజకవర్గాల్లో గతంలో ఏర్పాటు చేసిన పవర్ బోర్ల మరమ్మతు పనులను పూర్తిగా మరిచిపోయారు. వాటిల్లో తాగునీరు నింపక పోవడంతో అవి అలంకార ప్రాయంగానూ.. కొన్ని చోట్ల కనుమరుగయ్యాయి.

గతంలో పోటాపోటీగా ఏర్పాటు..

- ట్యాంకుల్లో నీరు నింపడానికి దగ్గర్లో ఏర్పాటు చేసిన పవర్ బోర్‌లు ఉన్నాయా..? లేవా..? అనే విషయాలను కూడా సంబంధిత జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని బస్తీల్లో అక్కడక్కడ పవర్ బోర్లు కనిపిస్తున్నా.. మరమ్మతులు చేయించడం లేదు.
- అప్పట్లో వాటర్ వర్క్స్, కులీకుతుబ్‌షా నగరాభివృద్ధి సంస్థల(కుడా) వారు పోటీ పడి పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో వాటర్ ట్యాంక్‌లతో పాటు పవర్ బోర్‌లను ఏర్పాటు చేశారు.
- అప్పట్లో ఈ రెండు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది నడుమ సమన్వయ లోపం కారణంగా సమస్యలు తలెత్తాయి.
- రానురాను సంబంధిత జలమండలి సిబ్బంది నీటిని నింపడం విస్మరించడంతో నీటి డబ్బాలు సైతం నిరుపయోగంగా మారాయి.
- ఇప్పటికైనా సంబంధిత జల మండలి అధికారులు స్పందించి బస్తీలలో ఇప్పటికే ఏర్పాటు చేసిన పవర్ బోర్లకు మరమ్మతులు చేయించి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

‘విద్య, వైద్య సౌకర్యాలను మెరుగుపరుస్తాం’


మాట్లాడుతున్న మాధవీలత

అబిడ్స్: పాతబస్తీ ప్రజలకు విద్య, వైద్య సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు పేదరిక నిర్మూలన, పరిశుభ్రతకు పాటుపడతానని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత అన్నారు. మంగళవారం నాంపల్లిలోని పార్లమెంట్ నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ..నాలుగు దశాబ్దాలుగా పాతబస్తీలో అభివృద్ధి పూర్తిగా నిలిచి పోయిందన్నారు. బస్తీల్లో డ్రైనేజీ పొంగిపొర్లడం, తాగునీరు, విద్యుత్ సమస్య, రోడ్లు తదితర సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నా పాతబస్తీ మాత్రం అభివృద్ధి చెందడం లేదని, అందుకు మజ్లిస్ పార్టీ కారణమని ఆమె ఆరోపించారు. పాతబస్తీ ప్రజల నుంచి సంపూర్ణ సహకారాన్ని పొంది రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో విజయం సాధించేందుకు పాటు పడుతున్నామన్నారు. తాను మొదట జర్నలిస్ట్, తదుపరి ఐఏఎస్ కావాలనుకుని చివరకు ప్రజా సేవకురాలనయ్యానని ఆమె వివరించారు. తమ ఫౌండేషన్‌ల ద్వారా పాతబస్తీలోని అనేక ప్రాంతాలలో సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు టి.యమన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌బజార్ పరిధిలో ఫ్లాగ్‌మార్చ్



సుల్తాన్‌బజార్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ ఫోర్స్ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ మార్చ్‌లో సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా, గుజరాతీగల్లీ, కేఎస్ లేన్, రాయల్ ప్లాజా, రాంకోఠి క్రాస్‌రోడ్ష్, షంషీర్‌బాగ్, రాజమొహల్లా, కుబ్దిగూడ, ఇస్లామియా బజార్, గోకుల్‌చాట్ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్‌తో పాటు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కిరణ్, సతీష్, శ్వేతలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వైజ్ఞానిక శాస్త్రాలన్నింటికీ కేంద్ర బిందువు రసాయన శాస్త్రం


సదస్సు సంచికను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డితో పాటు ప్రముఖులు

చార్మినార్: వైజ్ఞానిక శాస్త్రాలన్నింటికీ రసాయన శాస్త్రం కేంద్ర బిందువని హైదరాబాద్ ఐపీసీటీ సంచాలకులు డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి సౌజన్యంతో ఎమర్జింగ్ ఇంటర్ సిపిప్లినరీ హారిజాన్స్ ఇన్ కెమికల్ సైన్సెస్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సులో భాగంగా మంగళవారం ప్రారంభమైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నిత్య జీవితంలో రసాయన శాస్త్ర వినియోగం రోజురోజుకూ వేగవంతమవుందున్నారు. హైదరాబాద్ ఐఐటీ ఆచార్యులు డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ..నానో టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ రంగాల అభివృద్ధికి వేగవంతంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లారస్ ల్యాబ్స్ ఉపాధ్యక్షులు డాక్టర్ మణి భూషణ్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్, సదస్సు సంచాలకులు డాక్టర్ ఏలూరి యాదయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ ద శుక్లా, రసాయన శాస్త్ర వేత్త డాక్టర్ మహేంద్ర దేవల్, డాక్టర్ రాజేందర్‌రావు, డాక్టర్ రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్రించిన పరిశోధనా పత్రాలతో కూడిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి


వివరాలు అడుగుతున్న డాక్టర్ క్రాంతి

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో అంగ వైకల్య నిర్ధారణ పరీక్షలకు వచ్చే వారు ఆన్‌లైన్‌లో తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోని రావాలని గోల్కొండ ఏరియా ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ క్రాంతి అన్నారు. మంగళవారం ఏరియా ఆసుపత్రిలో సదరం క్యాంప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రికి వచ్చిన వికలాంగులతో మాట్లాడారు. సదరం క్యాంప్‌కు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికే పరీక్షలు నిర్వహిస్తామని నెంబర్ లేని వారికి ఎటిపరిస్థితిలో ధ్రువపత్రం ఇచ్చేది లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి మంగళవారం ఈ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం మొత్తం 32 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 23 మంది ఆర్థోపెడిక్, తొమ్మిది మంది ఫిజిషియన్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి


పోల్కం యాదగిరిని సత్కరించిన మాజీ మంత్రి చిన్నారెడ్డి

అబిడ్స్: అన్నివర్గాల అభివృద్ధి కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే కృషి చేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్వాతంత్ర్య సమర యోధులు పోల్కం యాదగిరి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేరు కులస్తుల కార్పొరేషన్‌ను మొదటిసారి ఏర్పాటు చేయడంతో మంగళవారం ఆయన గాంధీ భవన్‌కు వచ్చి పలు కాంగ్రెస్ అగ్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోల్కం యాదగిరిని మాజీ మంత్రి చిన్నారెడ్డి ఘనంగా సత్కరించారు. అనంతరం పోల్కం యాదగిరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో చురుకుగా, 30 సంవత్సరాలకు పైగా వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోల్కం శ్రీనివాస్‌కు మేరు సంఘం కార్పొరేషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పార్టీకి క్రమశిక్షణ గల నాయకుడిగా ఉంటూ పోల్కం శ్రీనివాస్ ప్రజా సమస్యల పరిష్కారానికి, మేరు కులస్తులకు అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరించాలి

నాంపల్లి: అణగారిన వర్గాలకు విద్యను దూరం చేసే నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ పిలుపునిచ్చారు. ఎన్ఈపీకి వ్యతిరేకంగా నిజాం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమానికి హాజరైన ఏఐఎస్ఎఫ్ నేతలను పోలీసులు అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్యార నరేష్ మాట్లాడుతూ..విద్యా కాషాయీకరణ, విద్యా ప్రైవేటీకరణ కోసమే నూతన విద్యా విధానాన్ని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానం–2020 సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు తిరస్కరించాలని కోరారు. దేశంలో జాతీయ విద్యా విధానం వల్ల దాదాపు 90 శాతం విద్యార్థులు నాణ్యమైన విద్య పొందే హక్కును కోల్పోతారని, విద్యా వ్యాపారీకరణ వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు సామాజిక న్యాయం దూరం చేసే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్ మాట్లాడుతూ..ఎన్ఈపీకి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఐదు కోట్ల సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ నిజాం కళాశాల ఏఐఎస్ఎఫ్ కన్వీనర్ సుశాంత్, విద్యార్థి సంఘాల నేతలు గణేష్, రణదీప్, శివ, కె.గణేష్, మనోజ్, వినయ్, సందీప్, దీపక్, ధోని, రాజేష్, అనిల్ పాల్గొన్నారు.

టోలిచౌకీ రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే


టోలిచౌకీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఆయిల్ ప్రవహించిన టోలిచౌకీ, రేతిబౌలి రోడ్లను మంగళవారం ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ పరిశీలించారు. గత వారం యూసుఫ్ టెక్డీలో షూటింగ్ హవేలీ వద్ద ఉన్న ఆయిల్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వేలాది గ్యాలెన్‌ల ఆయిల్ రోడ్లపై కాలువలా ప్రవహించింది. వాటిని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ ప్రమాదానికి కారకులను ఇంకా పోలీసులు గుర్తించలేదని ప్రమాదానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన రెండవ రోజు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఘటన స్థలానికి వచ్చి పరిశీలించి వెళ్లారని అయితే అధికారులు మాత్రం తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. రోడ్లపై వాహనాలు స్కిడ్ కాకుండా తాను స్వయంగా ఉండి పౌడర్ చల్లానని ఆయన పేర్కొన్నారు. యూసుఫ్ టెక్డీ–టోలిచౌకీ చౌరస్తా, సాలార్‌జంగ్ కాలనీ–టోలిచౌకీ చౌరస్తా వరకు వెంటనే రోడ్లు వేయాలని తాను బల్దియా అధికారులను కోరానని ఆయన అన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకుడు ఆలీముద్దీన్ తదితరులున్నారు.

పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి..

కార్వాన్ నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న మోడ్రన్ డ్రైనేజీ వరద నీటి పైప్‌లైన్‌ల పనులు వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కౌసర్ అధికారులను కోరారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ప్రాజెక్టు అధికారులతో సమావేశం అయ్యారు. ఎండిలైన్స్, కంపెనీ బాగ్ చౌరస్తా, లంగర్‌హౌస్, టోలిచౌకీ, టూమ్స్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఈ పనులు జరుగుతున్నాయని ఆయన అన్నారు. యుద్ధప్రాతిపదికన మిగిలిన పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు.

బీఆర్ఎస్ పార్టీకి జీవన్‌సింగ్ రాజీనామా


జీవన్‌సింగ్

లంగర్‌హౌస్/జియాగూడ: సార్వత్రిక ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఠాకూర్ జీవన్‌సింగ్ బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి మంగళవారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని తెలంగాణ భవన్‌లోని మాజీ సీఎం కేసీఆర్ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా జీవన్ సింగ్ మాట్లాడుతూ..తనకు ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి రెండు సార్లు అవకాశం కల్పించినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్వాన్ నియోజకవర్గంతో తన వెన్నంటి ఉండి పార్టీ కోసం అహర్నిషలు కష్టపడ్డ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. తన అనుచరులు, నియోజకవర్గ ప్రజలతో చర్చించి త్వరలో తన భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ రాజీనామా


మాణిక్‌రావు

అబిడ్స్: నగర మార్కెటింగ్ మాజీ డైరెక్టర్, దళితరత్న అవార్డు గ్రహీత మాణిక్‌రావు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన మాణిక్‌రావు ఎంపీ రంజిత్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా కొనసాగుతూ పదేళ్లుగా గోషామహల్‌లో బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఎంతో కృషి చేశారు. మాణిక్‌రావు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో దూసుకుపోతుందన్నారు.

ఎట్టకేలకు గోల్కొండ ఆసుపత్రికి నీటి ట్యాంకర్లు



గోల్కొండ: తమ ఆసుపత్రికి జలమండలి వారు మళ్లీ యథావిధిగా నీటి ట్యాంకర్లు పంపుతున్నారని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. గత కొద్ది రోజులుగా ట్రాఫిక్, జలమండలి వారి నిబంధనలు, ఆంక్షలతో గోల్కొండ ఏరియా ఆసుపత్రికి షేక్‌పేట్ ఫిల్టర్ జలమండలి అధికారులు ఆసుపత్రికి నీటి ట్యాంకర్లు పంపడం ఆపేశారు. ఈ విషయంపై ఆసుపత్రి అధికారులు ట్రాఫిక్ ఏసీపీ, జలమండలి అధికారులను కలిసినా ఫలితం లేకుండాపోయింది. అయితే తాము ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్‌ను కలిసి ఆసుపత్రిలో నీటి ఆవశకతపై వివరించడం జరిగిందన్నారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి గోల్కొండ ఏరియా ఆసుపత్రికి వెంటనే నీటి ట్యాంకర్లు పంపాలని ఆదేశించారని ఆయన అన్నారు. మంగళవారం గోల్కొండ డివిజన్ జలమండలి మేనేజర్ సయ్యద్ సాజిత్ గోల్కొండ ఏరియా ఆసుపత్రికి ట్యాంకర్‌లతో వచ్చి నీటిని సరఫరా చేశారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

నాంపల్లి: ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హుస్సేన్‌సాగర్ జంక్షన్–నెక్లెస్ రోడ్డు రైల్వే స్టేషన్ల మధ్యలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) గుర్తు తెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు గళ్ల చొక్కా, లేత నీలం రంగు జీన్స్ షర్టు ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది’


ఐటా హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఈ రంగంలో పని చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారు ఎందరో ఉన్నారని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ సమీఉల్లా హుసేనీ అన్నారు. మంగళవారం షేక్‌పేట్ మండలానికి చెందిన పలువురు సంఘ సేవకులు, ప్రైవేటు పాఠశాలల లీడర్లను ఐటా ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఐటా షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ హిదాయత్ ఆలీఖాన్ మాట్లాడుతూ.. అత్యుత్తమమైన విద్యను పేదలకు సైతం అందదించడానికే తాము ప్రథమ ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటా షేక్‌పేట్ మండల కార్యదర్శి బాషా, సయ్యద్ జమాలుద్దీన్‌ఖాద్రీ, సయ్యద్ షేబాజ్ అహ్మద్ తదితరులున్నారు.

ప్రజల సౌకర్యార్థమే కార్డన్ సర్చ్


స్వాధీనం చేసుకున్న అక్రమ సిలిండర్లు, మద్యం బాటిళ్లు

అబిడ్స్: ప్రజల సౌకర్యార్థమే కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బలరామ్ గల్లీలో మంగళవారం సాయంత్రం దాదాపు 150 మంది పోలీసులతో ఇంటింటా కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలు, 17 అక్రమ గ్యాస్ సిలిండర్లు, 24 మద్యంను స్వాధీనం చేసుకున్నారు. 20 మంది రౌడీషీటర్లను అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ ఉదయ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సౌత్‌వెస్ట్ జోన్‌లోని రౌడీషీటర్లను అందరిని పిలిపించి వారికి కౌన్సెలింగ్ చేపడుతున్నామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో పాటు జోన్ పరిధిలోని పలువురు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి మాధవీలత

సుల్తాన్‌బజార్: మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఎదిగినప్పుడే వారి హక్కులు కాపాడుకోగలరని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షురాలు కొండు పుష్పలీల అన్నారు. మంగళవారం తెలంగాణ ముదిరాజ్ జేఏసీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళా శక్తిని గుర్తించి గౌరవించినప్పుడే సమాజం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఈటల జమున అన్నారు. ప్రముఖ సంఘ సేవకురాలు, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ..సనాతన ధర్మంపై మహిళలు అనుసరించిన విధానాలు మహిళల సంక్షేమానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పోల్కం లక్ష్మీనారాయణ ముదిరాజ్, వైస్ చైర్మన్ పగిడాల సుధాకర్, ప్రధాన కార్యదర్శి భీమా లక్ష్మణ్ ముదిరాజ్, నగర శాఖ అధ్యక్షురాలు లింగాల పుష్పలత, ప్రధాన కార్యదర్శి నీరజ ముదిరాజ్, నగర శాఖ అధ్యక్షులు గుండు నరసింహ ముదిరాజ్, కార్యదర్శి పోల్కం ప్రశాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



చాంద్రాయణగుట్ట: బండ్లగూడలోని మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం ఉద్యోగ నియామకాల మేళా (ప్లేస్ మెంట్ డ్రైవ్) నిర్వహించారు. ప్రముఖ కంపెనీ ఎక్సెల్‌ఆర్, ఎంబీఏలో ప్రతిభ గల ఐదుగురు విద్యార్థులను రూ.3.5 నుంచి రూ.4 లక్షల ప్యాకేజీతో నియామకాలు చేయడం పట్ల కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బీటెక్‌లోని అన్ని బ్రాంచ్‌లలో 22 మంది విద్యార్థులను క్యూ స్పైడర్స్ కంపెనీ రూ.4.2 లక్షల నుంచి రూ.4.8 లక్షల వరకు నియామకాలకు ఎంపిక చేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి సంరెడ్డి ధనుంజయ రెడ్డి, ప్రిన్సిపాల్ ఉషా శ్రీ, సుబ్బారెడ్డి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి అభివాదం


ప్రధానికి అభివాదం చేస్తున్న శివకుమార్ యాదవ్

జియాగూడ: ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యాటనలో భాగంగా బేగంపేట్ విమానాశ్రయంకు చేరుకున్న మోదీని గోల్కొండ జిల్లా బీజేపీ డెయిరీ సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభివాదం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..దేశ ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని వెల్లడించారు.

మోదీతోనే సుస్థిర పాలన


మోదీకి స్వాగతం పలుకుతున్న అక్కినమోని వెంకటేష్

చాంద్రాయణగుట్ట: నరేంద్రమోదీ సుస్థిర పాలనలోనే దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని ఉప్పుగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు అక్కినమోని వెంకటేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌కు విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి బేగంపేట విమానాశ్రయంలో స్వాగతం పలికారు. బీజేపీలో పని చేస్తున్న ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. డివిజన్ స్థాయి కార్యకర్తను కూడా మోదీ కలుస్తుండడం సంతోషకరమన్నారు. మోదీని మూడోసారి ప్రధానిని చేసేందుకు కార్యకర్తలందరం కష్టపడి పని చేస్తామన్నారు.

మోదీని కలవడం అదృష్టం


ప్రధాని మోదీకి వీడ్కోలు పలుకుతున్న నాగిల్లా శ్రీకాంత్

సంతోష్‌నగర్: సాధారణ కార్యకర్తగా ఉన్న తనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని స్వయంగా కలవడం అదృష్టంగా భావిస్తున్నట్లు సంతోష్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు నాగిల్లా శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని బేగంపేట్ ఎయిర్‌పోర్టులో ఆయన కలిసి వీడ్కోలు పలికారు.

ప్రత్యేక పూజలు



చార్మినార్: యాదాద్రి శ్రీ లక్ష్మీ నర్సింహ్మ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య మంగళవారం ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిచారు. మహంకాళేశ్వర ఆలయ కమిటీ తరఫున స్వామి వార్లకు ప్రత్యేకంగా తయారు చేయించిన ఫల, పుష్పాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రియల్టర్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం


దేవర శ్రీనివాస్

గోల్కొండ: బీజేపీ లోక్‌సభ హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి క్యాంపెన్ ఇన్‌చార్జిగా సీనియర్ బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్‌ను నియమించింది. మంగళవారం ఆయన పార్టీ అధిష్టానం నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. గతంలో కూడా బండి సంజయ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సంగ్రామ యాత్రకు ఆయన భోజన విభాగం ఇన్‌చార్జిగా పని చేసి పార్టీ అధిష్టానం మన్ననలు పొందారు. హైదరాబాద్ లోక్‌సభ క్యాంపెన్ ఇన్‌చార్జిగా నియమితులైన ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ సీటును ఈసారి బీజేపీ గెలుచుకోవడం ఖాయమని అన్నారు.

సైకిళ్ల దొంగ అరెస్ట్

చాంద్రాయణగుట్ట: ఖరీదైన సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్న దొంగను శాలిబండ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ.85 వేల విలువజేసే 11 సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..కాజీపురా ప్రాంతానికి చెందిన మహ్మద్ అజీం ఖాన్ ఈనెల 15న ఉదయం రూ.35 వేల విలువైన తన హీరో ఎలక్ట్రో సైకిల్‌ను ఇంటి ఆవరణలో పార్కు చేశాడు. మధ్యాహ్నం చూడగానే సైకిల్ కనిపించలేదు. ఈ విషయమై శాలిబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా పహాడీషరీఫ్ వాదే ముస్తఫా బస్తీకి చెందిన సయ్యద్ వాహిదుద్దీన్(48)ను అరెస్ట్ చేశారు. ఇళ్ల ముందు పార్కు చేసిన సైకిళ్లను చోరీ చేస్తున్నట్లు గుర్తించారు.

ఆధారాలు లేని రూ.25 లక్షల నగదు స్వాధీనం

సుల్తాన్‌బజార్: అక్రమంగా రూ.25 లక్షల నగదు తరలిస్తున్న ఓ వ్యక్తిని సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి నగదును స్వాధీనపరచుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి తెలిపిన వివరాల ప్రకారం..కాచిగూడ బర్కత్‌పురాకు చెందిన అనూప్ సోని(35) సికింద్రాబాద్ నుంచి కాచిగూడ రాంకోఠికి వస్తున్నాడు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రాంకోఠి చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు దొరకడంతో అతని వద్ద రూ.25 లక్షల నగదు బయటపడింది. దీని తాలుకు ఎలాంటి రసీదులు లేకపోవడంతో నగదును స్వాధీన పరచుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.